కం082

# మేరీ ఆవాజ్ సునో

దాదాపు ఐదేళ్ళ తరువాత హైదరాబాద్ వచ్చాను. అప్పటికీ, ఇప్పటికీ ఎంత మార్పు! ఆశ్చర్యం వేసింది. ఎన్ని ఫ్లైఓవర్లు! ఎంత గ్రీనరీ! ఏం అందం!.... మతి పోయింది నాకు. బేగంపేట, బషీర్‌బాగ్, సెక్రటేరియట్ రోడ్డు, లుంబినీ పార్క్ ఇవన్నీ చూస్తుంటే భూలోక స్వర్గం అనే పదం గుర్తొచ్చింది.

''ఎంత ఫాస్టు డెవలప్‌మెంట్! అన్నాను'' పక్కనున్న హారికతో, చిన్న చిరునవ్వు విసిరింది హారిక. 'ఇదేం చూశావు! సాయంత్రం హైటెక్ సిటీ, శిల్పారామం చూపిస్తాను అప్పుడు చెప్పు నువ్వు గమనించిన అభివృద్ధి గురించి' అంది.

''అంత బాగుంటాయా?'' చిత్రంగా చూశాను. ''మీ అమెరికాకి తీసిపోవు'' ఐదేళ్ళ క్రితం నా పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే సుడిగాలిలా వచ్చి చుట్టేశారు పెళ్ళి వాళ్ళు. పెళ్ళి చూపులు చూడడం, పిల్ల నచ్చిందనడం, ముహూర్తాలు పెట్టడం, పెళ్ళి కాగానే విమానం ఎక్కడం అంతా కలలా గడిచిపోయింది. న్యూజెర్సీలో మా వారితో కాపురం మొదలయ్యాక తెలిసింది కలకాదని అంతా నిజమని.. కల్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదన్న సామెత నా పట్ల అక్షరాలా నిజమైందనిపించింది.

నేను అమ్మా, నాన్నలని చూడడానికి ఇండియాకి వచ్చింది ఈ మధ్యే నేరుగా వైజాగ్ వెళ్ళి అమ్మా, నాన్నల్ని చూసి, నా చిన్న నాటి స్నేహితురాలు హారికను కలుసుకుని, నా జన్మస్థలం హైదరాబాద్‌ని చూసుకోవచ్చని రెండు రోజులక్రితం ఇక్కడికి వచ్చాను. నేను పుట్టింది హైదరాబాద్‌లోనే. నాన్నఉద్యోగరిత్యా బదిలీలంటూ అనేక ఊళ్ళు తిరిగి, మళ్ళీ కొంతకాలం హైదరాబాద్‌లో ఉండి, మళ్ళీ వెళ్ళి, ఇక్కడికి రావడం అలా చాలా సార్లు జరిగింది. అయితే ఇప్పుడు కేవలం, నేను హైదరాబాద్‌ని చూడాలని మాత్రమే రావడంతో కళ్ళు మూసి తెరిచేంతలో మహానగరంలో వచ్చిన మాయాజాలం లాంటి మార్పు గమనిస్తుంటే అద్భుతంగా అనిపిస్తోంది నాకు.

''ఈ అభివృద్ధికి కారణం ఎవరు? చంద్రబాబేనా? ఇంత సీనుందా ఆయనకి?'' అడిగాను.

''యువముఖ్యమంత్రి కదా! భారతదేశం, ముఖ్యంగా తన ఆంధ్రప్రదేశ్ అమెరికాకి ఏ విధంగాను తీసిపోకూడదని యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెట్టాడు. ఐ. టి. రంగంలో విచిత్రమైన మార్పులెన్నో వచ్చాయి. నువ్వేచూస్తావుగా!'' ఆ హారిక మాటలు ఊరిస్తున్నట్టుగా అనిపించాయి.

ఎప్పుడెప్పుడు వెళ్ళి హైటెక్ సిటీ చూద్దామా అనిపించింది. కాని, చాలాకాలం తరువాత ఇండియాకి రావడంతో బంధువుల ఇళ్ళు చుట్ట పెట్టడానికి ఎక్కడి సమయం సరిపోలేదు. హైదరాబాద్‌లో వున్నవాళ్ళ సంగతి అటుంచి, విజయవాడ, గుంటూరు కూడా వెళ్ళాలి. నేను తిరిగి వైజాగ్ వెళ్లేటప్పుడు ఈ రెండు చోట్లకి వెళ్ళచ్చు లెమ్మని కరీంనగర్‌లో చిన్నాన్నవాళ్లని, గద్వాలలో అత్తయ్యా వాళ్ళని చూసి వచ్చాను. రెండు రోజులు తిరుపతి వెళ్ళాం నేనూ ఆయనా. దారిలో హారిక చెప్పిన హైటెక్ సిటీ గురించి, శిల్పారామం గురించి ఆయనకి చిలవలు పలవులుగా వర్ణించి చెప్పాను. అంతా విని ఆయన అన్నారు. ''తిరుపతి నుంచి రాగానే ముందు ఈ రెండు చుట్టపెట్టు. నేనీలోగా వరంగల్‌లో మా ఫ్రెండ్‌వాళ్ళింటికి వెళ్ళి వస్తాను?''

అన్నట్టుగానే తిరుపతి నుంచి తిరిగి హైదరాబాద్ రాగానే ఆయన వరంగల్ వెళ్లారు. వెళ్లేటప్పుడు చెప్పారు ''చూడు నేను ఎల్లుండి వచ్చేస్తాను. ఈలోగా నీ హైటెక్ యాత్రలు ముగించేసెయ్, వైజాగ్ వెళ్ళిపోదాం, మనకింక ఎక్కువ టైమ్ లేదు'' అని.

''నేను చార్మినార్ వెళ్ళి ముత్యాల నగలు కొనాలి కదండీ, అక్కడి వాళ్ళు చాలా మంది ఏవేవో కొనుక్కురమ్మని చెప్పారు'' అన్నాను.

''అన్నీ అయిపోవాలి, కావాలంటే ఇంకొక రోజు శాంక్షన్ చేస్తాను'' అన్నారు. చాలు అదే పదివేలు అనుకున్నాను. ఆరోజే నేనూ, హారిక కలిసి మాదాపూర్ వెళ్లాం. హారిక స్నేహితురాలు ఒకమ్మాయి హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్. ఆ అమ్మాయిని కలుసుకునే నెపంతో వెళ్ళి మొత్తం ఆ భవన సౌందర్యాన్ని వీక్షించగలిగాము. ''మయుడిని తలదన్నేలా రూపుదిద్దిన

ఆర్కిటెక్టు ఎవరబ్బా'' అని బోలెడాశ్చర్యం వేసింది. ఎక్కడన్నా, దుర్యోధనుడు మయసభ అనుకుని చూడడానికి వచ్చాడేమో! అని కాసేపు మూలమూలలా వెదికాను. నా ఆశ్చర్యం చూసి హారిక గర్వంగా నవ్వుతూ ''చూశావా, మా సైబరాబాద్ ఘనత, మా ముఖ్యమంత్రిగారి మేధస్సు'' అన్నది. ''కంగ్రాచ్యులేషన్స్ హరీ!'' అన్నాను. ''థ్యాంక్స్ నీ కంగ్రాట్స్ మా బాబుకూ్క్డా అందచేస్తాను'' అన్నది.

శిల్పారామం సంగతి చెప్పనే అవసరం లేదు. ప్రాచీన సంస్కృతికి ఆధునిక నగిషీలు చెక్కినట్టుగా వుంది. ఆ సౌందర్యాన్ని చూడడానికి నాకు సహస్రాక్షువులుంటే ఎంత బాగుండు! అనిపించింది.

ఆనాటి నగర పర్యటన మధురానుభూతుల్ని గుండెనిండా నింపుకుని ఇంటిదారి పట్టాము. మరునాడు ఇద్దరం కలిసి చార్మినార్ వెళ్ళాం. తను శిథిలమవుతున్నా, చరిత్రను శిథిలం కానీకుండా గంభీరంగా నిలబడివుంది చార్మినార్. నా అణువణువూ ఒక్కసారి పులకించింది.

ఉస్మానియా యూనివర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న రోజుల్లో శాలిబండ దగ్గర అత్తయ్య వాళ్ళింట్లో నేనున్న రెండుసంవత్సరాల కాలం గిర్రున తిరిగింది నా కళ్ళముందు.

నాన్నకి బెంగుళూరు బదిలీ కావడంతో మా చదువులు డిస్టర్బ్ అవకూడదని నన్నూ, తమ్ముడిని చిన్న అత్తయ్య వాళ్ళింట్లో వుంచి అమ్మా, నాన్నా బెంగుళూరు వెళ్ళిపోయారు.

అత్తయ్యా వాళ్ళింటి పక్కన ఓ ముస్లిం కుటుంబం ఉండేది. ఆ కుటుంబయజమాని పేరు జాఫరు. అతని భార్య ఫాతిమా. వాళ్ళకి పదకొండుమంది పిల్లలుండేవాళ్ళు. క్రికెట్ టీమ్ అని ఏడిపిస్తుండేవాడు తమ్ముడు. ఆ కుటుంబం గుర్తొచ్చింది. అత్తయ్యా వాళ్ళు కూడా లేరిప్పుడు విజయవాడ వెళ్లారు. ఆ కుటుంబం చాలా బీద కుటుంబం. అత్తయ్య వాళ్ళ మేడకి దిష్టితగలకుండా, దిష్టిబొమ్మలా ఉండే ఓ శిథిలమైపోయిన పెంకుటిల్లు, ఒక్కటే గది. అదే గదిలో వంటచేసుకుంటూ, చిరుగుల బొంతలు వేసుకొని పడుకునే వాళ్ళు ఇంటిల్లిపాది, పేదరికానికి ప్రతిరూపంలా ఉండేదా గది.

''ఏంటే! ఏం ఆలోచిస్తున్నావు?'' అడిగింది హారిక పరధ్యానంగా వున్న నన్ను. ''ఏంలేదు'' అన్నాను, అన్నానే కాని ఎందుకో గాని నాకు వాళ్ళ పిల్లలంతా కళ్ళముందు కదిలారు. బన్ను తిని, టీ తాగి కడుపునింపుకుంటూ, చిరుగుల బట్టలతో అయినా చిరునవ్వుతో తిరిగే ఆ చిన్నారులకు కోరికలంటే ఏంటో, ఆశలంటే ఏంటో తెలియదు. వాళ్ళ పేదరికం చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుండేది. కడుపునిండా తిండి, కట్టుకోడానికి బట్టలేని ఆపిల్లలకి మిగిలిన భవిష్యత్తు జీవితం ఎలా గడుస్తుంది? అని ఆలోచిస్తుండేదాన్ని, నన్ను రోజూ చార్మినార్ దగ్గర బస్టాండ్‌లో దింపేవాడు జాఫర్ తన ఆటోలో, ఆ ఆటోనే వాళ్ళకి జీవనాధారం.

ఐదుగురు ఆడపిల్లలు, ఆరుగురు మగపిల్లలు, అతని భార్య ఫాతిమా అత్తయ్య వాళ్ళింట్లో పని చేస్తుండేది. పిల్లలంతా చిన్న చిన్నవాళ్ళు. పెద్దపిల్ల సారా వయసు అప్పటికి పన్నెండేళ్ళు. దాని తరువాత అరిఫ్, లతిమా ఇంకా పేర్లు గుర్తుకు రాలేదు. వాళ్ళు పదకొండు మందిలో ఒక్కళ్ళు కూడా స్కూల్‌గేట్ వైపు కూడా ఎన్నడూ వెళ్ళలేదు. పదేళ్ళ ఆరిఫ్, యూసఫ్ అనుకుంటా రెండో వాడు, తొమ్మిదేళ్ళుండేవి, వాళ్ళిద్దరూ చార్మినార్ దగ్గర రబ్బరుబ్యాండులు, క్లిప్పులూ, గిల్టు నగలు అమ్ముతుండేవాళ్ళు. సారా ఇంట్లో పని చేసుకుంటూ ఉండేది. పిల్లలందరికీ ఏడాది మాత్రమే తేడా.

సారా ఏ మాత్రం సమయం దొరికినా నా దగ్గరికి వచ్చి కూర్చుని చిన్న చిన్న ఇంగ్లీషు పదాలు నేర్చుకుంటుండేది. చదువు మీద ఆ అమ్మాయికి చాలా శ్రద్ధ ఉండేది. 'చదువుకోవచ్చు కదా అంటే' పప్పా స్కూల్లో చేర్పించదు' అనేది. నేనో రోజు అడిగాను జాఫర్‌ని, ''పిల్లల్ని స్కూల్లో చేర్పించవచ్చు కదా!'' అని.

''తిననీకి పైసలు సరిపోతలేవు, సదువులు ఏడికెల్లి వస్తయి బిడ్డా మా అసొంటి గరీబోల్లకి'' అనేవాడు. ''గవర్నమెంటు స్కూల్లో వేయవచ్చుగా!'' అంటే చదువు ఊరికే చెప్పినా, పుస్తకాలని, డ్రస్సులనీ ఖర్చుంటుంది. నా దగ్గర అంత డబ్బులేదన్నాడు.

చార్మినార్ ప్రాంతంలో అడుగు పెట్టగానే ఆ కుటుంబం గుర్తొచ్చింది. పాపం ఎక్కడున్నారో. అత్తయ్య వాళ్ళు కూడా విజయవాడ వెళ్ళిపోయారు. అంతమంది పిల్లల్ని ఎలా పోషిస్తున్నాడో, బహుశా హైదరాబాద్‌లాగే ఆ

కుటుంబ పరిస్థితి కూడా మారి ఉంటుందిలే. బీదవాళ్ళకి బాగుపడడానికి చాలా అవకాశాలిచ్చాట్ట బాబు అనుకున్నాను. కానీ, మనసులో ఎందుకో వాళ్ళని చూడాలని నాకు బాగా అనిపించింది. ముఖ్యంగా నా పట్ల ఆత్మీయంగా ఉండే సారాని చూడాలనిపించింది. అంత పేదరికంలో కూడా, ఫ్యాన్సీ వేషం వేసుకున్న రాజకుమార్తెల్లా ఉండే వాళ్ళు ఆ పిల్లలు తెల్లగా, ఎర్రటి పెదాలతో, నల్లని కళ్ళతో, నాజూగ్గా, దంతపు బొమ్మల్లా.

నేను పరీక్షలై తిరిగి వెళ్ళిపోతుంటే బాగా ఏడ్చింది. ''ఆంటీ! మీరు ఉంటే నాకు బాగుంది మీరెళ్ళిపోతారా'' అంటూ. ఒక్కసారిగా అదంతా గుర్తురావడంతో నా మనసంతా చెదిరిపోయినట్టు అయింది. చిన్న చిన్న భుజాల మీద పిల్లల బాధ్యత, ఇంటి బాధ్యత మోసిన ఆ చిన్నారి ఎలా వుందో!

హారికా, నేను ముత్యాలు, గాజులు వగైరా షాపింగ్ చేస్తున్నంత సేపు నాకెందుకో పది పన్నెండేళ్ళపిల్లలు కనిపిస్తుంటే ఆ కుటుంబం, వాళ్ళ పిల్లలు కళ్ళలో మెదలసాగారు.

ఈ సమాజంలో ఎన్ని మార్పులో వచ్చాయి. ఎన్నో కుటుంబాలు పెరిగిన అధునిక సౌకర్యాలనుపయోగించుకొని బాగుపడ్డాయి. చక్కగా సెటిల్ అయ్యారు. నా చిన్నప్పటికీ, ఇప్పటికీ ఎంతో మార్పు కనిపిస్తోంది. నిజం చెప్పాలంటే హారికవాళ్ళు కూడా ఐదుగురు పిల్లలు, అందరూ చదువుకుని పైకొచ్చారు. ఎవరి ఉద్యోగాలు వాళ్ళు చేసుకుంటూ వాళ్ళ బ్రతుకులు వాళ్ళు సుఖంగా బతుకుతున్నారు. హారిక భర్త సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. హారిక కూడా ప్రైవేటు కంపెనీలో స్టెనోగా చేస్తోంది. ఒక్కతే పాప వాళ్ళకి. ఆరోగ్యంగా ముద్దుగా ఉంటుంది.

ఇలాగే జాఫరు పిల్లలు కూడా జీవితంలో ఏదో ఒక విధంగా స్థిరపడి ఉంటారని బలంగా అనిపించింది. అలా అనుకుని నా మనసుకి సర్దిచెప్పుకుని వాళ్ళని మర్చిపోవడానికి ప్రయత్నించాను. ఇంకా ఏమన్నా కొనాలా అడిగింది హారిక. 'చాల్లే కొనడానికి అంతెక్కడ? ఏది చూస్తే అదే కొనాలనపిస్తుంది' అన్నాను! కారుపార్కు చేసిన చోటికి నడుస్తుంటే ''ఆంటీ ఈ క్లిప్పులు కొనండి ఆంటీ మూడురూపాయలే పాకెట్టు ప్లీజాంటీ'' అంటూ వెంటబడ్డాడో ఐదేళ్ళ కుర్రాడు. 'వద్దని చెబితే అర్థం కాదా?' విసుక్కుంది హారిక. ''ఒక్కటే

కొనండాంటీ, ప్లీజాంటీ ఖానా ఖాకే దో దిన్ హోగయా ఆంటీ'' నేను చివుక్కున తలతిప్పి ఆ కుర్రాడికేసి చూసాను. కడుపులో చెయ్యిపెట్టి దేవినట్టయింది. బ్యాగులోంచి డబ్బులు తీస్తుంటే హారిక అన్నది ''అదంతా నిజం అనుకుంటున్నావా? అన్నీ నాటకాలు వాడు అన్నం తిని రెండురోజులైతే ఈ ఎండలో ఎలా తిరగ్గలడు? పద పద ఇలాంటి వాళ్ళు చాలా మంది తగులుతారు ఇక్కడ?' నేను చిల్లర తీసి వాడిచేతిలో వేసి, నా కవసరం లేకపోయినా ఓ క్లిప్పుల పాకెట్టు కొన్నాను. ''డాలరు వేశావా?'' నవ్వింది హారిక.

''పోనీలే చిన్నవాడు ఇట్లా కష్టపడుతుంటే చూడలేను. నాకు నచ్చదు చదువుకోవల్సిన పిల్లలిలా కష్టపడడం'' అన్నాను. మా ముందు ఒక పదహారేళ్ళ అమ్మాయి పరిగెత్తుకుంటూ వచ్చింది, ఆ అమ్మాయి చేతిలో మల్లెపూల గంప వుంది 'ఆంటీ పూలు' అంటూ నావేపు చూసి 'ఆంటీ' అన్నది సంతోషంతో వెలిగిపోతున్న మొహంతో. నేను ఒక్క క్షణం నిర్ఘాంతపోయి 'సారా' అన్నాను. ''నేను ఆంటీ మీరిక్కడికి ఎప్పుడొచ్చారు?'' వెలిగిపోతున్న కళ్ళతో చూస్తూ అన్నది.

''నేనొచ్చి పదిరోజులైంది నువ్వేంటి సారా ఇదేంటి'' పూలగంప వైపు చూశాను. సారా నవ్వింది. ఆ నవ్వులో విషాదం కొట్టొచ్చినట్టు కనిపించింది. కత్తెర తీసుకుని పెద్దమాల కత్తిరించి నా చేతికిచ్చింది. ''అమ్మా, నాన్నా బాగున్నారా?'' అడిగాను. సారా కళ్ళలో నీళ్ల తిరిగాయి ''లేరాంటీ చనిపోయారు'' నా కాళ్ళక్రింద భూమి కంపించినట్టు అనిపించింది. 'ఎప్పుడు' అడిగాను. ''మూడేళ్ళయింది రండాంటీ అక్కడ కూర్చుందాం చెరుకు రసం తాగుతారా'' అడిగింది.

నేను హారిక వైపు చూశాను విసుగ్గా చూస్తోంది హారిక. ''తరువాత వస్తాలే మీ తమ్ముళ్ళు ఏంచేస్తున్నారు?'' అడిగాను.

''అందరం ఇక్కడే వ్యాపారం చేస్తున్నాం. మా పెద్ద తమ్ముడు సైకిల్ రిపేరింగ్ షాపులో పని చేస్తున్నాడు, మా ఇల్లు పోయిన సంవత్సరం వరదలు వచ్చినప్పుడు కొట్టుకుపోయింది''.

''అలాగా అరెరె'' బాధ ప్రకటించబోయాను కానీ నానోట మాటరానంత బాధ నా గొంతులో అడ్డంపడింది.

''మా అబ్బా నడిపే ఆటోకు ఒకసారి యాక్సిడెంట్ అయింది. అబ్బా చచ్చిపోయాడు. ఆ తరువాత మాకు తిండి కూడా దొరకలేదు. మీ చుట్టాలు వేరే ఊరు పోయినంక మాఅమ్మకి తిండిలేక చచ్చిపోయింది. అబ్బా ఉన్నప్పుడే నా పెళ్ళి ఒక షేకుతో అయ్యింది. ఆయన అబ్బాకి నలభైవేలు ఇస్తానని ఇయ్యలేదు. అబ్బా కొట్లాడిండు కానీ మధ్యలో ఉండేటాయన పదివేలు ఇచ్చిండు, అబ్బకి, కొన్నిరోజులు అందరికి మంచి బట్టలు కొని మంచిగనే ఉన్నరు. నేను దుబయ్ పోయిన. మా ఆయన చచ్చిపోయినంక నేను ఇక్కడికి వచ్చేసిన, మా అబ్బ షికరు పడుతుండె షికరులోనే ఆటో నడుపుత యాక్సిడెంటు చేసిండు''.

''మీరిప్పుడు ఎక్కడ వున్నారు సారా?'' అడిగాను హీనస్వరంతో. 'మాకు ఇళ్ళు ఏడ' ఉంటయాంటీ, నాంపల్లి స్టేషన్ కాడ గుడిసె వేసుకున్నం, రాత్రిపూట మా తమ్ముళ్ళు ప్లాట్‌ఫారం మీద చాయిలు అమ్ముతరు. నేను చాయి చేసిస్త. నిద్రొస్తే అడనే జరసేపు పండుకుంటం''.

నా చెవులకి ఇక ఏమీ వినిపించలేదు. వారం రోజులుగా నేను చూసిన హైటెక్ ప్రగతి, నగర సౌందర్యం ఇప్పుడు చాలా అసహ్యంగా కనిపిస్తోంది. అభాగ్యుల ఆవేదన తీర్చలేని హైటెక్‌లు, పేదవారి ఆకలి తీర్చలేనీ గ్రీనరీలు, తరతరాలుగా ధూళిలో బ్రతుకుతూ. ప్లాట్‌ఫారాలనే మహారాజా ప్యాలేస్‌లుగా భావిస్తూ, అక్కడే విశ్రాంతి తీసుకునే బాల కార్మికులకి భవిష్యత్తునివ్వలేని ఐ.టి. రంగఅభివృద్ధి ఎందుకు?.

ఈ సారా, ఆమె తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఎందరో, ఎందరెందరో చిరిగిన బట్టల్లో, దుమ్ము కొట్టుకుపోయిన బతుకుల్తో సైబరాబాదంతా, 'మాకు బతుకునివ్వండి' అని ఆర్తనాదం చేస్తూ తిరుగుతున్నట్టనిపించింది.

(అమీనా లాంటి ఎందరో అభాగ్యులకి అంకితం)

\- ప్రజాశక్తి

ఆదివారం తేది 1-4-2001